తప్పకుండా ఆయన శరీరమును రక్తమును జ్ఞాపకముంచుకొనుచున్నామో లేదో యని మనం పరీక్షించుకోవాలి. యిది తీవ్రమైన సంగతి. ఏలయనగా దానిని అనాలోచితముగా ఆచరించితే మనకు మనమే శిక్షా విధి కలుగజేసు కొందుమని పౌలు చెప్పుచున్నాడు. సరిగ్గా చేయకపోతే మనం దీవెనను పోగొట్టు కొందుము. పాపము చేసిన వారమవుదుము.

### ఎవరు పాల్గొనాలి?

"క్రైస్తవేతరులు దీనిలో పాల్గొన వచ్చునా?"యని కొందరు ప్రశ్నిస్తారు. యిది క్రీస్తుతోను, దేవునితోను యుండు సహవాసమని మనం జ్ఞాపకముంచు కోవాలి. దీనిని ఆచరించునప్పుడు యేసు కూడా ఆయన రాజ్యమైన సంఘములో మనతో పాల్గొందురు. ఆయన సంఘమే ఆయన శరీరము, ఆయన రాజ్యము గనుక యిది ఆయన రాజ్యసభ్యులైన వారికి దాచి యుంచ బడిన ఆశీర్వాదము. ఎవరు పాల్గొనాలో ఎవరు పాల్గొనరాదోయని కొందరు సహోదరులు షరతులు విధిస్తారు. అట్లు చేయుటలో తమ్మును తాము తీర్పరులుగా చేసికొందురు. గాని మనం తీర్పు తీర్చరాదు. ఒక వ్యక్తి యొక్క హృదయమెట్లున్నదో మనమెరుగము. అది ప్రభువు రాత్రి భోజనము ఎవరిదో కాదు. అదొక సహవాసము. ఎవరైనను క్రీస్తుతో సహవాసము లేకుండిన యెడల అతడు నశించినవాడవుతాడు. గనుక క్రీస్తు యొక్క సహవాసములో లేడు. ఒకడు చేయునదంతయు ఒక రొట్టె ముక్కను తిని, కొంచెం ద్రాక్షారసమును రుచి చూస్తాడు. అతడు రక్షింపబడిన వాడు కాదు గనుక ప్రభువు రాత్రి భోజనములో పాల్గొనినందున రక్షింప బడిపోడు. ప్రభువు రాత్రి భోజనములో పాల్గొనునప్పుడు మన మనస్సును హృదయమును క్రీస్తు సిలువపై కేంద్రీకరించాలి. ఇతరులపై కాదు.

-జెర్రీ బేట్స్




# సత్యవాక్కు

పోస్టు బాక్స్ - 80, కాకినాడ
ఆంధ్రప్రదేశ్ - 533 001.
ఫోన్ : 0884-2363722, సెల్ : 98489 98547
ఎడిటర్: జాషువా గూటం

క్రొత్త నిబంధన క్రైస్తవ పునరుద్ధరణ కొరకు

సంపుటి - 44 ఏప్రియల్ - 2023 సంచిక -9


## క్రీస్తు నందలి విశ్వాసము - 2

యేసుక్రీస్తు నందలి విశ్వాసము ను గూర్చి గత సంచికలో మనము కొంతమట్టుకు నేర్చుకొనియున్నాము. క్రీస్తునందు విశ్వాసముంచుటయనగా యేసుక్రీస్తు యొక్క నిత్యత్వమును విశ్వసించుట. ఆయన ఆదినుండియు దేవుడై యుండెనని మానవులను రక్షించు నిమిత్తము నరావతారియై ఈ లోకమునకు వచ్చెనని విశ్వసించ వలెను.

రెండవదిగా క్రీస్తునందు విశ్వాసముంచుటయనగా మన పాపముల నిమిత్తము ఆయన మరణించెనని విశ్వసించుట. ఆయన మనకు బదులుగా మనస్థానములో పాప ప్రాయశ్చిత్తబలిగా మరణించెనని తద్వారా దేవునికి మనకు మధ్య సమాధానమును నెలకొల్పెనని విశ్వసించవలెను.

మూడవదిగా క్రీస్తు నందు విశ్వాసముంచుటయనగా ఆయన మృతులలో నుండి తిరిగి లేచెనని మృతులలో నుండి తిరిగి లేచుట ద్వారా ఆయన దేవుని కుమారునిగా మహిమా ప్రభావము లతో నిరూపించబడెనని

విశ్వసించ వలెను. యేసుక్రీస్తు మృతులలో నుండి తిరిగి లేచెననునది ఒక కట్టుకథకాదు గాని అది ఒక చారిత్రాత్మక సత్యము. మరియు దానిని గూర్చి సాక్ష్యమిచ్చిన వారు నమ్మదగిన సాక్షులు. క్రీస్తు పునరుత్థానుడైన తరువాత ఆయన యొక్క రక్షణ సువార్త సమస్త జనులకు ప్రకటింపబడవలెనని ఆయన ఆజ్ఞాపించెను.

నాలుగవదిగా క్రీస్తునందు విశ్వాసముంచుట యనగా ఆయన ద్వారా పాపముల నుండి కలుగు రక్షణ యందు విశ్వాసముంచుటయగును. ''ఇప్పుడాయనను కన్నులారా చూడకయే విశ్వసించుచు మీ విశ్వాసమునకు కలుగు ఫలమును అనగా ఆత్మరక్షణను పొందుచు చెప్ప నశక్యమును మహిమాయుక్తమునైన సంతోషముగలవారై ఆనందించు చున్నారు" అని అపో. పేతురు వ్రాసెను (1పేతురు 1:9). అంతేకాకుండా "కడవరి కాలమందు బయలు పరచ బడుటకు సిద్ధముగానున్న రక్షణ మీకు కలుగునట్లు విశ్వాసము ద్వారా దేవుని శక్తిచేత కాపాడబడు మీకొరకు అస్వాస్థ్యము పరలోకమందు భద్రపరచ బడియున్నది"యని అతడు వ్రాసెను (1పేతురు 1:5).

**రక్షణ యనగా పాపము యొక్క పర్యవసానము నుండి శక్తి నుండి విడుదలపొందుట యని అర్థము.** రక్షణ అనుభవము ఒకనికి గలపాపము నుండి విడుదల పొందుటను గూర్చి చెప్పుటకును, క్రీస్తు మరల వచ్చు నప్పుడు దేవుని సన్నిధానమునకు చివరిగా కొనిపోబడి పరలోకములో నిత్యము ఆయనతో యుండుటను గూర్చి చెప్పుటకును బైబిలునందు ఉపయోగింపబడినది. పాపము నుండి విడుదల పొందు ప్రత్యేక సంఘటన లను వర్ణించుటకు బైబిలు నందు కొన్ని పదములు వినియోగింపబడినవి. ఉదాహరణకు 1పేతురు 1:18, 19లో పేతురు వ్యర్థప్రవర్తనను గూర్చి వ్రాసెను: ''పితృపారంపర్యమైన మీ వ్యర్థప్రవర్తనను విడిచిపెట్టినట్లుగా వెండి బంగారముల వంటి క్షయ వస్తువులచేత మీరు విమోచింపబడ లేదు గాని అమూల్యమైన రక్తము చేత అనగా నిర్దోషమును నిష్కళంకమునగు గొర్రెపిల్ల వంటి క్రీస్తు రక్తముచేత మీరు విమోచింపబడితిరి''యని అతడు వ్రాసెను. రక్షింపబడినవారు వ్యర్థ ప్రవర్తన నుండి విడుదల పొందినట్లు పేతరు వ్రాసెను. దానినే పౌలు పాపపు జీవితమని చెప్పెను (ఎఫెసీ 1:7). పాపము నుండి విమోచింపబడినవారు తమ జీవితములో పాపపు బాని సత్వము నుండి విడుదల పొందిన వారు.

**పాపము నుండి రక్షింపబడుట యనగా ఆత్మను పవిత్ర పరచుకొనుట యని, పూర్వపాపములకు శుద్ధికలిగించుకొనుటయని పేతురు వ్రాసెను** (1 పేతురు 1:23:2 పేతరు 1:9). అంతే కాకుండా రక్షింపబడుట యనగా నీతి మంతునిగా తీర్చబడుటయని బైబిలు సూచించుచున్నది (రోమా5:1). పాపములో యున్న మానవులు శిక్షకు పాత్రులు వారు దేవుని యెదుట అపరాధులు (రోమా 3:23) గాని మానవులు నీతిమంతులని తీర్చబడి నప్పుడు దేవుడు వారిని క్షమించబడిన వారని పాపపు అపరాధముల నుండి విడుదల పొందినవారని దేవుడు ప్రకటించును. అందువలన రక్షింప బడినవారు నీతిమంతులుగా దేవుని సమాధానమును కలిగియుందురు.

**రక్షణ యనగా దేవునితో తిరిగి సంబంధము నేర్చుకొనుట లేక సమాధానపడుటయని లేఖనములలో చెప్పబడినది.** మానవుని పాపములు దేవుని నుండి అతనిని ఎంత ఖచ్చిత ముగా దూరపరచినవో (యెషయా 59:1,2), అంతే ఖచ్చితముగా అతడు పాపము నుండి దాని శక్తి నుండి విడుదల పొందినప్పుడు దేవునితో తిరిగిసంబంధము నేర్పరచుకొన

గలదు.

రక్షణను దేవుని వాక్యము మనకు తెలియజేయునప్పుడు దానిని క్రీస్తు మరణము ద్వారా, ఆయన సువార్త ద్వారా, ఆయన శక్తిద్వారా మనకు తెలియజేయుచున్నది. ఉదాహరణకు దేవుడు మన అపరాధములను మనమీద మోపక క్రీస్తునందు లోకమును తనతో సమాధానపరచు కొనెను అని 2 కొరింథీ 5:19 చెప్పుచున్నది. "కాబట్టి ఆయన రక్తము వలన ఇప్పుడు నీతిమంతులుగా తీర్చబడి మరింత నిశ్చయముగా ఆయన ద్వారా ఉగ్రతనుండి రక్షింపబడుదుము" అని రోమా 5:9 చెప్పుచున్నది. మానవులు క్రీస్తు రక్తము వలన విమోచింపబడుదురు అని 1పేతురు 1:18, 19 చెప్పుచున్నది. క్రీస్తు యొక్క రక్తము ద్వారా మానవులు తమ పాపముల నుండి శుద్ధి చేయబడుదురు (హెబ్రీ 9:14).

మానవులు పాపమును పాపముగా పరిగణించనంత కాలము, అంటే పాపమనగా దేవుని ఆజ్ఞను అతిక్రమించుటయని గురి తప్పిపోవుటయని, తమ యెడల దేవుని సంకల్పము నుల్లంఘించుటయని మానవులు గ్రహించనంతకాలము వారు క్రీస్తు నందు నిజముగా విశ్వాసముంచు పరిస్థితిలో యుండరు. కొందరు యేసు ప్రభువు నందు నమ్మికగలవారమేయని చెప్పుకొందురు గాని ఆయన ఆజ్ఞలకు లోబడనొల్లరు. అట్టివారు విశ్వాసులు కాదు గాని నిజానికి అవిశ్వాసులే.

క్రీస్తునందు విశ్వాసముంచుట యనగా యేసుక్రీస్తు ఆది నుండియు దేవుడై యుండెనను సాక్ష్యమును అంగీకరించుట. నిజమైన విశ్వాసము క్రీస్తు మన పాపముల విషయమై మృతి బొందెనని అంగీకరించును. మరల ఆయన లేఖనముల ప్రకారము మూడవ దినమున తిరిగి లేచెనని అంగీకరించును. సరియైన విశ్వాసము క్రీస్తును రక్షకునిగా అంగీకరించును.



**యేసుక్రీస్తు ఆయనకు విధేయులైన వారికే రక్షణ కర్తయగును.** "ఆయన కుమారుడై యుండియు తాను పొందిన శ్రమల వలన విధేయతను నేర్చుకొనెను. మరియు ఆయన సంపూర్ణసిద్ధిపొందినవాడై... తనకు విధేయులైనవారి కందరికిని నిత్య రక్షణకు కారకుడాయెను" అని హెబ్రీ 5:8-10లో వ్రాయబడి యున్నది. విశ్వాసమొక్కటి మాత్రమే చాలును విధేయత అవసరము లేదను సిద్ధాంతము లేక బోధను విశ్వాసమును కాదుగాని అవిశ్వాసమును సూచించు చున్నది. ఒకడు నిజముగా క్రీస్తునందు విశ్వాసము గలవాడయినయెడల అతడు మారుమనస్సుపొంది, బాప్తిస్మము పొందవలెనను క్రీస్తు ఆజ్ఞలను ఎట్లు తిరస్కరించగలడు? (అపొ.కా. 2:38).

అవిశ్వాసము వలన కలుగు ఫలితములు దు:ఖకరమైనవి. అవి ప్రస్తుతమును నిత్యమునుకూడ దు:ఖ కరమైనవిగానే యుండును. అవిశ్వాసులు అగ్నిగంధకములతో మండుగుండములో పాలుపొందెదరని దేవుని వాక్యము ప్రకటించుచున్నది (ప్రకటన 21:8). విశ్వాసము వలన మానవులు దీవించబడుదురు. విశ్వసించుటలో సంతోషము, శాంతి నిరీక్షణలు నిజముగా మిళితమై యున్నవి. ఈ విశ్వాసము దేవుని వాక్యమును వినుటవలన గాని లేక చదువుట వలన గాని కలుగును (రోమా 10:17; యోహాను 20:30, 31). నేను ఆయననని మీరు విశ్వసించనియెడల మీ పాపములలోనే మరణింతురని యేసు చెప్పెను (యోహాను 8:24). విశ్వసించిన వాడు తన పాపములను గూర్చి మారుమనస్సు పొందని యెడల నశింతురు అని ఆయన బోధించెను. అటుతరువాత క్రీస్తునందలి విశ్వాసమును మనుష్యుల యెదుట ఒప్పుకొనవలెను. మనుష్యుల యెదుట నన్ను ఒప్పుకొనువాడెవడో పరలోకమందున్న నాతండ్రియెదుట నేనును వానిని ఒప్పుకొందునని

మత్తయి 10:32లో యేసు చెప్పెను. అటు తరువాత పాపక్షమాపణ నిమిత్తము క్రీస్తునామమున బాప్తిస్మము పొందవలెను (అపొ.కా.2:38).

క్రీస్తునందు విశ్వాసియైనవాడు ఆయనకు తప్పకలోబడును. క్రీస్తును నమ్ముకొనినను ఆయనకు విధేయుడు కానివాడు నిజానికి అవిశ్వాసియే. "కుమారునియందు విశ్వాసముంచు వాడే నిత్యముజీవముగలవాడు. కుమారునికి విధేయుడు కానివాడు జీవము చూడడుకాని దేవుని ఉగ్రత వాని మీద నిలిచియుండును'' (యోహాను 3:36). నీ విశ్వాసమునకు విధేయుడవగుటకు ఆలస్యము చేయవనియే నా నిరీక్షణ!.

## క్రీస్తు యొక్క సువార్త

క్రీస్తుయొక్క సువార్తను గూర్చి మనం క్రొత్త నిబంధనలో అనేకసార్లు చదువుతాము. యితరులు కూడా దానిని గూర్చి చెబుతుయుంటారు. మనము సువార్తను గూర్చి పలుమారులు పలుకుచూ యుంటాము. గాని సువార్త అనగా యేమిటి? క్రీస్తు సువార్త అనగా యేమిటి? జవాబు కొరకు లేఖనములను వెదుకుదాం! పౌలు యిట్లు చెప్పాడు: "ఆయన యందు విశ్వాసముంచు వాడెవడును సిగ్గుపడడని లేఖనము చెప్పుచున్నది. యూదుడని గ్రీకు దేశస్థుడని భేదము లేదు; ఒక్క ప్రభువే అందరికీ ప్రభువైయుండి తనకు ప్రార్ధన చేయువారందరి యెడల కృప చూపుటకు ఐశ్వర్యవంతుడై యున్నాడు. ఎందుకనగా ప్రభువు నామమును బట్టి ప్రార్ధన చేయవాడెవడో వాడు రక్షింప బడును. వారు విశ్వసింపని వానికి ఎట్లు ప్రార్ధన చేతురు? వినని వానిని ఎట్లు విశ్వసించుదురు? ప్రకటించు వాడు లేకుండా వారెట్లు విందురు! ప్రకటించువాడు పంపబడని యెడల ఎట్లు ప్రకటించుదరు? ఇందు



విషయమై ఉత్తమమైన వాటిని గూర్చిన సువార్త ప్రకటించువారి పాదములెంతో సుందరమైనవి యని వ్రాయబడి యున్నది'' (రోమా 10:11-15). ప్రాథమికంగా సువార్త అనగా మంచి వార్త యని యర్ధము. శుభవార్త, రక్షణ, సత్యము, వాక్యము, వాగ్ధానము మరియు నిరీక్షణ.

**సువార్త క్రీస్తు యొక్క మరణ, సమాధి, పునరుత్థానముల మీద ఆధారపడి యున్నది.** అపొ.పౌలు కొరంథీయులకు ఇట్లు వ్రాసాడు : మరియు సహోదరులారా, నేను మీకు ప్రకటించిన సువార్తను మీకు తెలియ పరచుచున్నాను. మీరు దానిని అంగీకరించితిరి. దాని యందే నిలిచి యున్నారు. మీ విశ్వాసము వ్యర్ధమైతే నేగాని, నేను ఏ ఉపదేశరూపముగా సువార్త మీకు ప్రకటించితినో ఆ ఉపదేశమును మీరు గట్టిగా పట్టుకొని యున్న యెడల ఆ సువార్తవలననే మీరు రక్షణ పొందువారై యుందురు. నాకియ్యబడిన ఉపదేశమును మొదట మీకు అప్పగించితిని అదేమనగా లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతిబొందెను. సమాధి చేయబడెను. లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను" (1 కొరింథీ 15:1-4).

అయితే యిది మంచి వార్త, లేక సువార్త యెట్లవుతాది? ఎట్లనగా క్రీస్తు యొక్క మరణ, సమాధి పునరుత్థానము ద్వారా మనము రక్షింపబడి నిత్యజీవ నిరీక్షణను పొందగలము. మరల అదే పౌలు ఇట్లు చెప్పుచున్నాడు: "సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడనుకాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి మొదట యూదునికి, గ్రీసు దేశస్థునికి కూడా రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియై యున్నది. ఎందుకనిన నీతి మంతుడు విశ్వాసమూలముగా జీవించునని వ్రాయబడిన ప్రకారము విశ్వాసమూలముగా అంతకంతకు విశ్వాసము కలుగునట్లు దేవుని నీతి దానియందు బయలు పరచబడు చున్నది (రోమా 1:16, 17).

మంచివార్త వినాలని మనందరకు ఆసక్తి యుంటాది. మనకేదైన మంచి జరిగినప్పుడు ఆ వార్తను అందరితోనూ పంచుకోవాలని మనం అభిలషిస్తాము. యిది మంచిదే. క్రీస్తువలన కలిగిన రక్షణను గూర్చిన మంచి వార్త విషయంలో కూడా మనం అట్లే స్పందించాలి. నీవు ప్రభువుకు లోబడి ఆయన కృపవలన రక్షింపబడితే దాన్ని యితరులతో పంచుకోవాలి. అందువలననే క్రీస్తు "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్త ప్రకటించుడి. నమ్మి బాప్తిస్మము పొందిన వాడు రక్షింపబడును. నమ్మని వానికి శిక్ష విధించబడును" యని చెప్పారు (మార్కు 16:15, 16).

## కృపా సువార్త

దేవుని సువార్తను గూర్చి కూడ లేఖనములు చెప్పుచున్నవి. పౌలు ఇట్లు వ్రాసాడు: "యేసుక్రీస్తు దాసుడును అపొస్తలుడుగా యుండుటకు పిలువబడినవాడును దేవుని సువార్తనిమిత్తము ప్రత్యేకింపబడిన వాడువైన పౌలు రోమాలో ఉన్న దేవుని ప్రియులందరికి అనగా పరిశుద్ధులుగా ఉండుటకు పిలువబడిన వారికి శుభమని చెప్పి వ్రాయునది. మన తండ్రియైన దేవుని నుండియు మన ప్రభువైన యేసుక్రీస్తు నుండియు కృపా సమాధానములు మీకు కలుగును గాక. దేవుడు తన కుమారుడును మన ప్రభువైన యేసుక్రీస్తు విషయమైన ఆ సువార్తను పరిశుద్ధ లేఖనములయందు తన ప్రవక్తల ద్వారా ముందుగా వాగ్దానము చేసెను. యేసుక్రీస్తు శరీరమును బట్టి దావీదు సంతానముగాను, మృతులలో నుండి పునరుత్థానుడైనందున పరిశుద్ధమైన ఆత్మను బట్టి దేవుని కుమారుడుగాను ప్రభావముతో నిరూపింపబడెను. ఈయన నామము నిమిత్తము సమస్త అన్యజనులు విశ్వాసమునకు విధేయులగునట్లు ఈయన ద్వారా మేము కృపను అపొస్తులత్వమును పొందితిమి. మీరును వారిలో ఉన్నవారై యేసుక్రీస్తు వారుగా ఉండుటకు



పిలువబడియున్నారు" (రోమా 1:1-7).

అదేభావములో సువార్త దేవుని కృపయై యున్నదని పౌలు చెప్పుచున్నాడు. "అయితే దేవునికృపా సువార్తను గూర్చి సాక్ష్యమిచ్చుట యందు నా పరుగును, నేను ప్రభువైన యేసు వలన పొందిన పరిచర్యను తుద ముట్టింపవలెనని నా ప్రాణమును నాకెంత మాత్రమును ప్రియమైనదిగా ఎంచుకొనుటలేదు" (అపొ.కా. 20 :24). తండ్రికిని యేసుక్రీస్తుకును మధ్య గల ఐక్యతను ఈ లేఖన భాగములు సూచించుచున్నవి. లోకమునకు సువార్త నందించాలని దేవుడే యేసుక్రీస్తును ఈ లోకమునకు పంపించారు. అందువలన అది దేవుని సువార్తయనిగాని, క్రీస్తు సువార్తయని గాని చెప్పవచ్చును.

## మహిమా సువార్త

దీనిని మహిమగల సువార్తయని కూడ పౌలు చెప్పుచున్నాడు. "అయినను శ్రీమంతుడగు దేవుడు నాకు అప్పగించిన ఆయన మహిమగల సువార్త ప్రకారము..." (1తిమోతి 1:11). మరల "మా సువార్త మరుగు చేయబడిన యెడల నశించుచున్న వారి విషయములోనే మరుగు చేయబడి యున్నది. దేవుని స్వరూపియైన క్రీస్తు మహిమను కనుపరచు సువార్త ప్రకాశము వారికి ప్రకాశింప కుండునట్లు, ఈయుగ సంబంధమైన దేవత అశ్వాసుల మనోనేత్రములకు గ్రుడ్డితనము కలుగజేసెను" (2 కొరింథీ 4:3,4). సువార్త మహిమా సువార్తయని చెప్పబడెను. అనగా అది పరసంబంధమైనది. నిత్యమైనది. మహిమగల దేవునిది ఏలయనగాఅది దేవుని నుండి క్రీస్తు ద్వారా కలిగెను.

మత్తయి, మార్కు, లూకా, యోహాను సువార్తలలో రాజ్యసువార్త అనే పదము వాడబడుట చూడగలము. "యేసు వారి సమాజమందిరములలో బోధించుచు రాజ్యసువార్త ప్రకటించుచు సమస్త

పట్టణములుయందును, గ్రామము లందును సంచారము చేసెను (మత్తయి 9:35). "యోహాను చెరపట్ట బడిన తరువాత యేసు కాలము సంపూర్ణమైనది. దేవుని రాజ్యము సమీపించి యున్నది; మారుమనస్సు పొంది సువార్త నమ్ముడని చెప్పుచూ దేవుని సువార్త ప్రకటించుచు గలిలియకు వచ్చెను" (మార్కు 1:14, 15). అప్పటికింకను దేవుని రాజ్యము (సంఘము) స్థాపింపబడలేదని గమనించవలెను గాని దాని స్థాపన అతి సమీపముగా యుండెను. తదుపరి ప్రభువు యొక్క మరణము పునరుత్థానముల యనంతరము అదే సువార్తయని ప్రకటించబడెను. ఆ సువార్త యొక్క ఆజ్ఞలకు లోబడినవారు రక్షింపబడిరి. ప్రభువు రాజ్యమైన సంఘముతో చేర్చబడిరి (అపో.కా. 2:47).

**రక్షణ సువార్త**

తరువాత రక్షణ సువార్తను గూర్చి మనం చదువుదుము. ఎఫెసులో యున్న క్రైస్తవులతో పౌలు, "మీరును సత్య వాక్యమును అనగా మీ రక్షణ సువార్తను విని క్రీస్తు నందు విశ్వాస ముంచి వాగ్దానము చేయబడిన ఆత్మ చేత ముద్రింపబడితిరి"యని చెప్పాడు (ఎఫెసీ 1:13). రక్షణ యిచ్చేది సువార్తయే. రక్షణ సువార్త సంకల్పమును గూర్చి కొన్నిసార్లు మనం చెప్పుకొందుము. అదే క్రీస్తు సువార్త రక్షణ మార్గము.

**సమాధాన సువార్త**

తరువాత సమాధాన సువార్తను గూర్చి మనం చదువుకొందుము. సమాధాన సువార్తను ప్రకటించు వారి "పాదములు యెంతో సుందరమైనవి (రోమా 10:15). మరియు పాదములకు సమాధాన సువార్త వలనైన సిద్ధ మనస్సను జోడు తొడుగుకొని నిలువ బడుడి"యని పౌలు హెచ్చరించు చున్నాడు (ఎఫెసీ 6:15). సువార్త శాంతిని సమాధానమును కలుగ జేయును.



యేసుక్రీస్తు శాంతి కాముకుడు. ఆయన అనుభవించిన శాంతిని సువార్త మనకనుగ్రహించును. అదే దేవునితో సమాధానము. నిజానికి యిదే శుభవార్త!

చివరిగా నిరీక్షణ సువార్తను గూర్చి చెప్పబడింది. "పునాదిమీద కట్ట బడినవారై స్థిరముగా ఉండి మీరు విన్నట్టియు, ఆకాశము క్రింద ఉన్న సమస్త సృష్టికి ప్రకటింపబడినట్టియు ఈ సువార్త వలన కలుగు నిరీక్షణ నుండి తొలగిపోక విశ్వాసమందు నిలచియుండిన యెడల యిది మీకు కలుగును. పౌలును నేను ఆ సువార్తకు పరిచారకుడనైతిని (కొలస్స 1:23). సువార్తకు లోబడుట వలన మనకు నిత్యజీవ నిరీక్షణ యున్నది. ఇంకోరీతిగా ఈ నిరీక్షణ కలుగదు.

దఫాధపాలుగా పౌలు 'నా సువార్త' 'మన సువార్త' యని చెబుతూ యుంటాడు. అనగా అతడును యితరు లును ప్రకటించిన సువార్తను గూర్చి అతని ఉద్దేశ్యము. "ఏలయనగా దేవుని వలన ప్రేమింపబడిన సహోదరులారా, మీరు ఏర్పర్చబడిన సంగతి అనగా మా సువార్త మాటలలో గాక శక్తితోను, పరిశుద్ధాత్మతోను, సంపూర్ణ నిశ్చయత తోను మీ యొద్దకు వచ్చియున్న సంగతి మీకు తెలియును. మీ నిమిత్తము మేము ఎట్టివారమై యుంటిమో మీరెరుగుదురు" (1థెస్స 1:5).

సువార్త లేఖనములలోని మాటలలో యున్నది. అది సూక్ష్మమైనదియే గాని శక్తివంతమైనది. అది కాలముతో పరిమితిలేని క్రీస్తు వలె ఆధునికమైనది. అది రక్షించును, నిరీక్షణనిచ్చును. అది క్రీస్తు సువార్త. దేవుని సువార్త, మహిమ సువార్త. అది దీవించును. ఛాలెంజ్ చేయును. బాధ్యతనను గ్రహించును. అది నా కొరకు, నీ కొరకు అందరికొరకు ఈయబడినది. అది నిజముగా మంచి వార్తయే!

– జె.సి.ఛోట్

# పరిశుద్ధులతో సమాజముగా కూడుకొనుట

కోవిడ్ వలన గాని మరి దేని వలన గాని చాలమంది ఆదివారపు ఆరాధనకు రాలేకపోవుచున్నందున ఆరాధనను జరిపించుట నిలిపివేయ వచ్చునా? ఆరాధన సమయం నిలిపి వేయుట వలన సాతానుడు మనలను మోసగించుటకు, సభ్యులను క్రీస్తు శరీరము నుండి దూరము చేయుటకు వానికి తరుణమిచ్చుచున్న వారమగు దుము. దేవుని ఆరాధించడానికి, స్తుతి చెల్లించడానికి మిగతా క్రైస్తవులతో కూడుకొనినప్పుడు సభ్యులు బోధింప బడుటకు, విశ్వాసములో బలపడుటకు తరుణము లభించును (ఎఫెసీ 4:12).

దేవుని ప్రజలు ప్రతి ఆదివారమున సమాజముగా కూడు కొనవలెనని హెచ్చరించబడ్డారు (అపో.కా. 20:7, 1కొరింథీ 16:1,2). అపొస్త లుల ద్వారా దేవుడు హెచ్చరించారు గనుక ఆదిమసంఘము ప్రతి ఆదివార మున కూడుకొనుచుండిరి (మత్తయి 28:20, 1 కొరింథీ 16:1, 2). మనం ప్రతి ఆదివారమున ఆరాధనకు కూడు కొనాలని దేవుడు కోరియుంటే ఆయన దానిని గూర్చి నేరుగా ఆజ్ఞాపించును గదా యని కొందరు చెబుతారు. ఆదివారమున మనం కూడుకొనాలని లేఖనములలో ఆయన ఎక్కడ చెప్పారు? మనం ఒక బిల్డింగులో కూడుకొనాలని ఆయన ఎక్కడ చెప్పారు? చర్చి బిల్డింగ్‌లో బెంచీలు వేసుకొనాలని ఎక్కడ చెప్పారు? యివి సంఘ కార్యక్రమములకు సహాయ పడును గనుక వీటిని వాడుకొన వచ్చును.

''మీ మధ్యనున్న దేవుని మందను పై విచారణ చేయుచు వాటిని కాయుడి"యని సంఘ పెద్దలు హెచ్చ రింపబడిరి (1పేతురు 5:2). "మీ పైని నాయకులుగా ఉన్నవారు లెక్క ఒప్ప జెప్పవలసిన వారివలె మీ ఆత్మలను కాయుచున్నారు. వారు దు:ఖముతో ఆ పని చేసిన యెడల



మీకు నిష్ ప్రయోజనము గనుక దు:ఖముతో కాక ఆనందముతో చేయునట్లు వారి మాట విని వారికి లోబడియుండుడి" (హెబ్రీ 13:17). పరిశుద్ధులు ఆదివారమున ఆరాధనకు రావలెనని పెద్దలు సంఘమును హెచ్చరించి నప్పుడు వారు క్రీస్తు యొక్క అధికారమునకు లోబడి ఆ పని చేయుచున్నారు. ఆరాధన కూడికలు మనకు సహాయపడుటకే గాని, నష్టము కలుగజేయుటకు కాదు. ప్రభువులో మనం ఎదుగుటకు ఆరాధన సహాయపడును. అయితే కొందరు ఈ హెచ్చరికలను మన్నించకపోవడం విచారకరము.

''కొందరు మానుకొను చున్నట్లుగా సమాజముగా కూడుట మానక ఒకని నొకడు హెచ్చరించుచు, ఆ దినము సమీపించుట మీరు చూచినది కొలది మరి యెక్కువగా ఆలాగున చేయుచు, ప్రేమ చూపుటకును సత్కార్యములు చేయుటకును ఒకని నొకడు పురికొల్ప వలెనని ఆలోచింతము (హెబ్రీ 10: 25). ఈ లేఖనములో కొన్ని సంగతులు విపులీకరించబడినవి :

1. సహోదర ప్రేమ మనం ఒకరితో నొకరు కలిసి ఆరాధించాలని హెచ్చరించుచున్నది.

2) ఈ కూటములకు హాజరు కావలెనని క్రైస్తవులు హెచ్చరింప బడిరి. సరిగదా అపొస్తలుల అధికారమును బట్టి ప్రతి కూటమునకు హాజరుకావ లెనని ఆజ్ఞాపింపబడిరి.

3) సమాజముగా కూడుకొని నప్పుడు హెచ్చరికలు చేయ బడతాయి.

4) మనము ఆలోచించుచున్న హెచ్చరికలు అవి సమాజపు హెచ్చరికలు.

5) ఈ కూడికలలో కలుగు హెచ్చరికలు వలన క్రైస్తవులకు క్షేమాభివృద్ధి కలుగును.

పరలోకము వెళ్ళగోరుచున్న యెడల మనం సమాజముగా కూడుకొనుట అవసరం అని లేఖనములు బోధించుచున్నవి. అయితే కొందరు మిగతా పరిశుద్ధులతో సమావేశమగుటకు ఇష్టపడరు. యిది ఎందువలన? వారు ఈ భూమి మీద దేవుని నుండి తప్పించుకొనజూతురు అయినను వారు పరలోకము వెళ్ళగోరుదురు! పరిశుద్ధులతో సమాజముగా విడువక కూడుకొనుట నమ్మకమైన క్రైస్తవుని లక్షణము.

ఆరాధన కూడికలకు అప్పుడప్పుడు హాజరయ్యేవారు నులి వెచ్చని తనమును సూచించుచున్నారు. ఉదాసీనత, స్వార్థపరత్వము వలన దేవుని కంటే ఈ లోక ప్రేమను వారు కలిగియుందురు. యిది హృదయ కాఠిన్యమునకు దారితీయును. నీతిమార్గము నుండి దూరముగా తొలగిపోవునట్లు చేయును. ఆరాధనకు హాజరు కాని వారు చెప్పే సాకులు సాధారణముగా బలమైనవి కావు.

''కాబట్టి మీరు ఆయన రాజ్యమును నీతిని మొదట వెదకుడి; అప్పుడవన్నియు మీకనుగ్రహింప బడును" (మత్తయి 6:33).

**- స్టీవ్ మిల్లర్**

## ప్రభువురాత్రి భోజనము

ప్రతి క్రైస్తవునికి ప్రభువు రాత్రి భోజనము ఆరాధనలో ప్రాముఖ్య భాగమై యున్నది. దీనిని గూర్చి మత్తయి 26:26-28; లూకా 22:14 -20 మరియు 1 కొరింథీ 11:23, 24లో ముఖ్యముగా చదువగలము. ప్రభువు రాత్రి భోజనమును గూర్చి పలు భావములున్నాయి.

**1. అది కృతజ్ఞత నిచ్చునది :** యేసు ప్రభువు రాత్రి భోజనమును ప్రతిష్టించినప్పుడు ఆయన కృతజ్ఞత చెల్లించారు. యేసుక్రీస్తు మన కొరకు చేసిన గొప్ప త్యాగమును బట్టి మనం కృతజ్ఞత కలిగియుండాలి.



**2. అదొక స్మారకము :** ఒక స్మారకచిహ్నమును వీక్షించగానే దాని వెనుకయున్న చరిత్ర మనకు జ్ఞాపకము వస్తాది. ప్రభువురాత్రి భోజనము మన తలంపులను క్రీస్తు సిలువ యొద్దకు నడిపిస్తాది. 1 కొరింథీ 11:25లో ప్రభువును జ్ఞాపకముంచుకొనవలెనని చెప్పబడినది.

**3. మనము ప్రభువు యొక్క మరణమును ప్రచురించుదుము :** "మీరు ఈ రొట్టెను తిని యీ పాత్ర లోనిది త్రాగునప్పుడెల్లా ప్రభువు వచ్చు వరకు ఆయన మరణమును ప్రచురము చేయుదురు" (1 కొరింథీ 11:26).

గనుక ఒక విధముగా ప్రభు రాత్రి భోజనము ప్రచురము చేయు నట్టిది. మనం ప్రభు రాత్రి భోజన ములో పాలుపొందుట యితరులు చూచినప్పుడు, మనం ప్రభువు చిందించిన రక్తములోను, నలుగ గొట్టబడిన ఆయన శరీరములోను అనగా ఆయనయందున్న పరిపూర్ణ విశ్వాసమును ప్రచురింతుము.

**4. మనం ఒండొరులతో సహవాసము కలిగియుందుము :** 1 కొరింథీ 10:16, 17ను గమనించుము ''మనము దీవించు ఆశీర్వచనపు పాత్రలోనిది త్రాగుట క్రీస్తు రక్తములో పాలు పుచ్చుకొనుటయే గదా? మనము విరుచు రొట్టెను తినుట క్రీస్తు శరీరములో పాలు పుచ్చుకొనుటయే గదా? మన మందరము ఆ యొక్కటే రొట్టెలో పాలుపుచ్చుకొను చున్నాము. రొట్టె ఒక్కటే గనుక అనేకులమైన మనము ఒక్కటే శరీరమై యున్నాము. పాలు పుచ్చుకొనుట సహవాసము. విగ్రహముల ఆలయములలో తినుట దెయ్యములతో సహవాసమని పౌలు చెప్పాడు. అదే రీతిగా ప్రభువు బల్లలో పాలుపుచ్చుకొనునప్పుడు మనము ప్రభువుతోను, క్రైస్తవులతోను సహవాసము కల్గియుందుము. క్రీస్తుతో

యున్న సహవాసమును బట్టి మన ఐక్యతను చాటుదుము.

### ప్రభురాత్రి భోజనములోని సంగతులు, దాని భావము

ప్రభురాత్రి భోజనములో యున్నవి సూక్ష్మమైనవి. స్మారకములను మానవులు చిరకాలముండునట్లు గ్రానైట్‌తోను, బంగారముతోను మొదలగువాటితో తయారు చేయుదురు. దేవుడైతే తన స్మారకమును సింపుల్‌గా రొట్టె ద్రాక్షారసములతో తయారు చేసారు. ఈ వదార్ధములకు మన హృదయములు భావమును చేకూర్చుస్తాయి. యేసు పులియని రొట్టెను వినియోగించారు (లూకా 22: 1, 8,9). పస్కాపండుగలలో యూదులు పులియని రొట్టెను వినియోగించాలని ఆజ్ఞాపింపబడిరి. గనుక యేసు అట్టి దానినే తీసికొని దానికి నూతన భావము చేకూర్చారు. ఇప్పుడది యేసు యొక్క భౌతిక శరీరమునకు గురుతుగా యున్నది. అది సిలువపై మన కొరకు నలుగగొట్టబడిన శరీరము. యేసు ద్రాక్ష పండ్ల రసమును తీసికొని అది ఆయన రక్తమునకు గురుతుగా యిచ్చారు. అనేకుల కొరకు ఆయన చిందించిన పవిత్ర రక్తమునకు గురుతుగా ద్రాక్షా రసమున్నది.

ఆయన రొట్టెను పట్టుకొని "యిది నా శరీరము" అని చెప్పారు (మత్తయి 26:28). ద్రాక్షారసమును గూర్చి "యిది నా రక్తము అనగా పాప క్షమాపణ నిమిత్తము అనేకుల కొరకు చిందింపబడుచున్న నిబంధన రక్తము" అని ఆయన చెప్పారు (మత్తయి 26:28). దీనిని గమనించిన తరువాత ప్రార్ధించిన తరువాత రొట్టె ద్రాక్షారసములు నిజముగా యేసు యొక్క శరీర, రక్తములుగా మారునని తప్పుగా తలంచుదురు. అవి యిది వరకెట్లున్నవో ప్రార్ధించిన తరువాత



కూడా ఒకే లాగున కనబడతాయి. ఒకే లాగున రుచి కలిగి యుంటాయి. వాటిలో భౌతికంగా మార్పేమి సంభవింపదు. గాని వాటి ఆత్మీయ భావము వేరు. యేసు యొక్క మాటల భావము అది. అవి ఆయన శరీరమునకు, రక్తమునకు గురుతుగా యున్నవని యేసు సూక్షముగా చెప్పారు. "నేనే ద్వారమును" అని యేసు యోహాను 10:9లో చెప్పారు. ఆయన నిజముగా ఒక ద్వారము అయ్యున్నానని ఆయన ఉద్దేశ్యము కాదు. గాని ఆత్మీయముగా ఆయన పరలోకమునకు పోవు ద్వారమై యున్నారు. రెండు వచనముల తరువాత "నేను గొర్రెల మంచి కాపిరిని" యని చెప్పారు. యేసు ఎన్నడు నిజముగా గొర్రెల కాయువాడుకాదు. ఆయన ఎన్నడు భౌతికంగా గొర్రెలు కాయరు. గాని ఆత్మీయముగా ఆయన ఆత్మల ప్రధాన కాపరి (1పేతరు 5:4). యేసు ఒక ద్వారమును, గొర్రెల కాపరియునై యున్నారు. అదేరీతిగా ప్రభు రాత్రి భోజనములోని సింపుల్ మూలికలు మనకు ఆయన శరీరమును, రక్తమును గురుతుకు తెచ్చు జ్ఞాపికలైయున్నవి.

1 కొరింథీ 11:24, 25లో ప్రభువైన యేసు తాను అప్పగింపబడిన రాత్రి ప్రభువు రాత్రి భోజనమును ప్రతిష్టించిన సందర్భమును పౌలు కొరింథీయులకు జ్ఞాపకము చేసాడు. "నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుడని" యేసు తన శిష్యులకు చెప్పారు. యేసుప్రభువు రాత్రి భోజనమును ప్రతిష్టించారు. గనుక అది ప్రాముఖ్యమైనది. అనేక సంవత్సరముల తరువాత ప్రభువు జ్ఞాపకార్ధమై దానిని సంఘము ప్రతిష్టించలేదు. అది సంఘము యొక్క సంస్కారముకాదు. దానిని క్రీస్తే ప్రతిష్టించారు. నమ్మకమైన క్రైస్తవులు సంఘారంభము నుండి దీనిలో

పాల్గొనుచున్నారు. క్రీస్తు యొక్క బలి యాగమును జ్ఞాపకముంచుకొను నిమిత్తము నిజక్రైస్తవులు దానిలో పాల్గొందురు. అయితే దానిని ఒక దు:ఖభరితమైన సమయముగా మనం పాటించరాదు. అయినను 1 కొరింథీ 10:16లో అది "ఆశీర్వచనపు పాత్ర" యని చెప్పబడినది. మనకై యేసు యొక్క మరణం గొప్ప విషాదము కాదు గాని అదొక గొప్ప ఆశీర్వాదము. మనం ఎప్పుడు అందుకొనలేనట్టి గొప్ప జీవమైయున్నది.

### ప్రభురాత్రి భోజనములో ఎప్పుడు పాల్గొనాలి?

ఆయా సంఘములు ప్రభు రాత్రి భోజనములో పాల్గొను వేర్వేరు సమయములున్నవి. కొందరు నెలకొక సారి, మరికొందరు మూడునెలకొక సారి లేదా ఏదో ఒక ప్రత్యేక పండుగ నాడు దానిని ఆచరిస్తారు. మరికొంద రైతే వారానికొకసారి దానిని ఆచరిస్తారు. మనం ఎన్నిసార్లు పాల్గొన వలెనో చెప్పే బైబిలు ఆజ్ఞ యేదీ లేదని కొందరు వాదిస్తారు. మనం ఎంత కాలానికి ఒకసారి దాని నాచరించాలో చెప్పే ఆజ్ఞ లేదనునది వాస్తవమే. అయితే అట్టిదేదీలేనప్పుడు జీవిత కాలంలో ఒక్కసారి దానిలో పాల్గొంటే సరిపోవును గదా.

ఆదిమ సంఘము యొక్క ఉదాహరణ అయితే శిష్యులు ప్రతి ఆదివారమున రొట్టె విరుచుటకు కూడు కొనిరి యని తెలియుచున్నది. వారు ముఖ్యముగా ప్రభు రాత్రి భోజనము నాచరించుటకు కూడుకొనిరియని తెలియుచున్నది. "ఆదివారమున మేము రొట్టె విరుచుటకు కూడినప్పుడు పౌలు మరునాడు వెళ్ళనైయుండి వారితో ప్రసంగించుచు అర్ధరాత్రి వరకు విస్తరించి మాటలాడుచుండెను'' (అపొ.కా.20:7). ఆదిమ క్రీస్తు సంఘము రొట్టె విరుచుటకు ఆదివార



మున కూడుకొనినట్లు ఇక్కడ చూడ గలము. రొట్టె విరుచుట అనగా ప్రభు రాత్రి భోజనములో పాల్గొనుట. ఆదిమ లేఖకులను బట్టి మొదటి క్రైస్తవులు ప్రతి ఆదివారమున ప్రభు రాత్రి భోజనము నాచరించినట్లు గ్రహించగలము. 1 కొరింథీ 11:20ని బట్టి కొరింథులో యున్న సంఘము ప్రభు రాత్రి భోజనము నాచరించుటకు ప్రతి ఆదివారమున కూడుకొనినట్లు తెలిసి కొనగలము. వారు కూడుకొనవలసిన సమయము వారములో మొదటి దినము (1కొరింథీ 16:2). మనము ప్రతి ఆదివారమున ఆరాధనకు కూడు కొందుము. ప్రతి ఆదివారమున రొట్టె విరుచుటకు కూడుకొందుము.

దానిని అంత ఎక్కువసార్లు ఆచరించుట వలన దాని భావము కోల్పోవునని కొందరు వాదించుదురు. సరిగదా అదొక ఆచారకర్మ యగునని వారందరు అది సాధ్యమే. అయితే మిగతా అన్ని విషయములలో కూడ అది సాధ్యమే. అయితే అప్పుడప్పుడు మాత్రమే మనం ఆరాధించాలని ఎవరు వాదించరు.

1 కొరింథీ 11:28, 29లో పౌలు ఇట్లు హెచ్చరించాడు: "కాబట్టి ప్రతి మనుష్యుడు తన్ను తాను పరీక్షిం చుకొనవలెను. ఆలాగు చేసి ఆ రొట్టెను తిని ఆ పాత్రలోనిది త్రాగవలెను; ప్రభువు శరీరమని వివేచింపక తిని త్రాగువాడు తనకు శిక్షావిధి కలుగుటకే తిని త్రాగుచున్నాడు". ఈ వచనము లను తరచు అపార్థము చేసికొంటారు. వారు దానిలో పాల్గొనుటకు యోగ్యులో కాదోయని ప్రతి ఆదివారము కొందరు ఆలోంచించుకొంటారు. మనం యోగ్యులమో అయోగ్యులమోయని అక్కడ చెప్పబడలేదు. గాని మనం యోగ్యముగా ఆచరించుచున్నామో లేదోయని అది చెప్పుచున్నది. మనం